

ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంతంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి విజయవాడకు చెందిన నీలిమ రూ.1,01,116 ఆదివారం అందజేశారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు 2.39 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 43.54 టీఎంసీలు నిల్వ ఉంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలు.

పానకం బిందె రూ.1.50



మంగళగిరి:పట్టణంలోని పానకాల లక్ష్మీనృసింహ స్వామి వారి పానకం రూ.1.50కు తగ్గించబడింది ఆలయ ఈఓ ఏ రామ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో పానకం ధర తగ్గించామని. భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

విఘ్నేశ్వరునికి ఘనంగా పూజలు



అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వర స్వామి ఉపాలయంలో ఆదివారం సంకటహర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జాగర్లపూడి శేషసాయి శర్మ ఈ సందర్భంగా స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

నరసరావుపేట రూరల్: పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని పమిడిమర్రులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గాలం సీతారామయ్య(55) తనకు చెందిన జీవాలను మేత కోసం పంటపొలాల వైపు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమయింది. ఆ సమయంలో సీతారామయ్యకు సమీపంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని కొందరు రైతులు కూడా ఈ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. సీతారామయ్యకు ముగ్గురు సంతానం ఉన్నారు. రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నరసింహుని ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం




బెల్లంకొండ: మండలంలోని కేతవరంలో గల శ్రీ వజ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం భక్తుడు రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు దేవదాయ శాఖ ఈవో వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన పాశం అంజిరెడ్డి దంపతులు ఆలయానికి వెళ్లి రూ.1.11లక్షలను ఆలయ అర్చకులు ప్రసన్నకుమార్‌కు అందజేశారని పేర్కొన్నారు.

అయిదు ఇసుక రీచ్‌ల నిర్వాహకుల ఖరారు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో అచ్చంపేట, అమరావతి మండలాలలో 5 ఇసుక రీచ్‌ల నిర్వాహకులను ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. అచ్చంపేట మండలంలో అంబడిపూడి-1, అమరావతి మండలంలోని పొందుగుల రీచ్‌లను మెస్సర్స్ గోదావరి కృష్ణా వాటర్ వర్క్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి రూ.54.99కు బిడ్ ఖరారు చేశారు. మెస్సర్స్ సాయి క్యూ అండ్ ఎస్ సొల్యూషన్స్ వారికి అంబడిపూడి-2 రీచ్‌ను రూ.89లకు, అంబడిపూడి-3 రీచ్‌ను రూ.99లకు, కోనూరు-1 రీచ్‌ను రూ.109లకు ఖరారు చేశారు. అమరావతి మండలంలోని మెస్సర్స్ సాయి క్యూ అండ్ ఎస్ సొల్యూషన్స్ వేసిన ఫైనాన్షియల్ బిడ్ ఆఫర్ ధర రూ.125లు డీఎల్ఎస్ ఫిక్స్ చేసిన బేస్ ప్రైస్ కంటే ఎక్కువ ఉండటం వల్ల రీ-టెండర్ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇసుక రీచ్‌లను దక్కించుకునేందుకు టీడీపీ వారే మరెవరికీ అవకాశం ఇవ్వకుండా 34 టెండర్లు వేసినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన ధరలో సగం ధరలకే బిడ్‌లను తమ పలుకుబడితో దక్కించుకోవడం వెనుక భారీ అక్రమాలకు పాల్పడి ఉండవచ్చుననే సందేహాలు వెలువడుతున్నాయి.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్, పశ్చిమ కాలువ, నిజాంపట్నం కాలువకు నీటిని ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 513, తూర్పు కెనాల్‌కు 82, కొమ్మమూరు కాలువకు 1217 క్యూసెక్కులు విడుదల చేశారు.

టీడీపీలో మద్యం చిచ్చు!

- నరసరావుపేటలో ముదురుతున్న అంతర్గత కలహాలు
- మద్యం సిండికేట్‌ను ముప్పతిప్పలు పెడుతున్న ఎమ్మెల్యే
- కొత్త దుకాణాలు తెరవనివ్వకపోగా ఉన్న బార్లు మూయిస్తున్న వైనం
- అధిష్టానం సీరియస్ కావడంతో నష్ట నివారణ చర్యలు
- మద్యం సిండికేట్ వల్ల పార్టీకి చెడ్డపేరంటున్న ఎమ్మెల్యే వర్గం
- ఎమ్మెల్యేపై ఫిర్యాదులను వైరల్ చేస్తున్న సిండికేట్



సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట తెలుగుదేశం పార్టీలో మద్యం ఇరువర్గాల మధ్య చిచ్చు రేపుతోంది. ఆదాయ వనరుగా ఉన్న మద్యం వ్యాపారంపై ఆధిపత్యం కోసం అధికార పార్టీలోని ఈ వర్గాలు పట్టుబట్టాయి. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న సిండికేట్ ఒకవైపు, అధికార అహంతో ఎలాగైనా దుకాణాలు పొందాలన్న ఎమ్మెల్యే వర్గం మరోవైపు పోటీ పడుతున్నాయి. దీంతో పేట టీడీపీలో అంతర్గతపోరు తారస్థాయికి చేరింది. ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటూ రచ్చకెక్కారు. ఈ నెల 14న లాటరీ విధానంలో మద్యం దుకాణాలు కేటాయించగా, 16వ తేదీ నుంచి దుకాణాలు తెరుచుకోవాల్సి ఉంది. నేటికీ జిల్లా కేంద్రంలో పూర్తిస్థాయిలో మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదు. ఇప్పటికే బార్ అండ్ రెస్టారెంట్ వ్యాపారం చేస్తున్న పలువురు కూటమి నేతలు సిండికేట్‌గా మారారు. పట్టణంలో 7 కుగాను 5 దుకాణాలను దక్కించుకున్నారు. వీరు కొత్త దుకాణాలు తెరవడం అటుంచితే ఉన్న బార్లలో వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. తమ దారికి రాకపోవడంతో ఎమ్మెల్యే వర్గం పోలీసులను ప్రయోగించి బార్లలో పనిచేస్తున్న సిబ్బందిని అక్రమంగా నిర్బంధిస్తోంది. అధికార పార్టీ నేతలకే పేటలో వ్యాపారం చేసుకోలేని పరిస్థితి నెలకొందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యే, ఆయన బృందం వ్యవహరిస్తున్నట్లు సిండికేట్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదులు చేశారు. అధిష్టానం సీరియస్ అయినట్టు సమాచారం. త్వరగా మద్యం వ్యవహారం ముగించి పార్టీకి చెడ్డపేరు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ అయ్యాయని తెలిసింది.

లిక్కర్ మాఫియా వల్లే...

బార్ అండ్ రెస్టారెంట్ వ్యాపారం చేస్తున్న కొందరు వ్యాపారులు మద్యం దరఖాస్తు విధానాన్ని తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే చదలవాడ వర్గానికి చెందిన నేతలు ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శించారు. ఇతర పట్టణాలకు చెందిన మద్యం వ్యాపారులు నరసరావుపేటలో వ్యాపారం చేయాలంటే తమతో కలిసి పనిచేయాలని నరసరావుపేట మద్యం సిండికేట్ బెదిరించి వాటాలు పొందిందని పేర్కొన్నారు. ఆ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు తమ ఎమ్మెల్యేపై లేనిపోని అవినీతి ఆరోపణలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. లిక్కర్ మాఫియా వల్లే పేట టీడీపీలో లేనిపోని సమస్యలు వస్తున్నాయని, తమకు అనుకూలంగా ఉన్న మీడియాలో రచ్చ చేస్తున్నారని వాపోయారు.

30 శాతం ఇచ్చేందుకు సిద్ధం...

మద్యం సిండికేట్లలో వాటా కావాలని కొన్ని రోజులుగా లాటరీలో దుకాణాలు కైవసం చేసుకున్న వారిని వేధింపులకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. ఇలా ఉంటే వ్యాపారం చేయడం కష్టమనుకున్న మద్యం సిండికేట్ ఎమ్మెల్యే వర్గానికి 30 శాతం వాటా ఇవ్వటానికి ముందుకు వచ్చినట్టు సమాచారం. తమ ప్రతిపాదనను ఓ మధ్యవర్తి ద్వారా ఎమ్మెల్యేకు పంపారట. దీనిపై ఎమ్మెల్యే స్పందన ఆధారంగా పూర్తిస్థాయిలో దుకాణాలను తెరవడం ఆధారపడి ఉంటుందని మద్యం సిండికేట్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

తల దించుకుంటున్న తెలుగు తమ్ముళ్లు...

ఎమ్మెల్యే చదలవాడ చేస్తున్న అవినీతి పనుల వల్ల నియోజకవర్గంలో పార్టీ పరువుపోవడంతో పాటు సొంత పార్టీ కార్యకర్తలే ఇబ్బంది పడుతున్నారని టీడీపీ కార్యకర్త వెంకట తులసీ రావు పేరిట ప్రచారం అవుతున్న ఓ వాయిస్ రికార్డింగ్ వైరల్ అవుతోంది. టీడీపీ పార్టీ సెంట్రల్ కార్యాలయం నుంచి వచ్చిన ఫోన్ కాల్‌లో ఆయన ఎమ్మెల్యే అవినీతిపై ఫిర్యాదు చేశారు. గతం నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి పెత్తనం ఇస్తున్నారని వాపోయారు. ఇసుక, మద్యం వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సొంత పార్టీ కార్యకర్తలను తీవ్ర స్థాయిలో వేధింపులకు గురిచేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న వర్గీయులు ఆ కాల్ రికార్డును నియోజకవర్గ గ్రూపుల్లో బాగా వైరల్ చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే తీరు అంతటా చర్చనీయాంశమైంది.



పంట మారితే.. సిరులు పండినట్టే

కొరిటిపాడు(గుంటూరు): ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన భూములు నిస్సారంగా మారి ఆశించినంతగా ఫలితాలు ఉండటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పెరగడమే కాకుండా భూమి కూడా సారవంతం అవుతుందని సాగు రంగం నిపుణులు చెబుతున్నారు. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారవంతంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఎక్కువగానే ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. భూమిలో నీటి నిల్వ శక్తి వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

భూమికి మేలు చేసే అపరాలు..

పంటల మార్పిడిలో భాగంగా అపరాల పంటలైన కందులు, మినుము, పెసలు, సజ్జలు, ఉలవలు వంటి పంటలు సాగు చేయడం వలన వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటాయి. అలాగే అపరాల పంటలు కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. ప్రధానంగా వీటి ఆకులు రాలడం వలన భూమికి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పంటల వేరు మొదళ్లు నత్రజనిని స్థిరీకరిస్తాయి.

తెగుళ్లు, చీడపీడల నివారణ కోసం..

ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వల్ల కొన్ని రకాల పురుగులు, తెగుళ్ల పంటను ఆశించి వృద్ధి చెందుతాయి. దీని వల్ల పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. పంట మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుములు, వేరుశనగ, పప్పుశనగ వంటి పంటలకు లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, మొక్కజొన్న, రాగులు వంటి ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. పత్తి వేసిన పొలంలో మిరప పంట, పొగాకు వేసిన పొలంలో పప్పుశనగ వంటి పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుంది. వరి వేసే పొలానికి ముందుగా జనుము, పిల్లిపెసర, జీలుగ వేస్తే సేంద్రియ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. ఏటా పొగాకు సాగు చేసే భూమిలో అపరాల పంటలు సాగు చేసి ఆ తర్వాత ఏడాది పొగాకు వేస్తే మళ్లీ తెగుళ్లు రాకుండా నాణ్యమైన పొగాకు సాగు అవుతుంది.

7 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో ముగ్గురు
- తొమ్మిది వాహనాలు సీజ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె. నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్: గంజాయి కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 7 కేజీల గంజాయితోపాటు 8 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, ఏనుగుల బజార్‌కు చెందిన షేక్ సుభాని, కుంకలగుంట గ్రామానికి చెందిన మేదరమెట్ల గణేష్ కుమార్, రజకవాడకు చెందిన చింతపల్లి సుభాని, గుంటూరు చుట్టగుంట ప్రాంతానికి చెందిన సాతినేని అశోక్ కుమార్‌లకు గంజాయి అలవాటు ఉందని, విక్రయం కూడా మొదలు పెట్టారన్నారు. ఈ క్రమంలో షేక్ సుభానికి చెందిన కారులో వైజాగ్ వెళ్లి గంజాయి తెచ్చి పట్టణంలో విక్రయించి డబ్బు సంపాదిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన షేక్ అష్రఫ్, షేక్ షరీఫ్, షేక్ చావపాటి ఉమర్ సాదిక్‌లు కారులో పెద్ద మొత్తంలో గంజాయి తీసుకొచ్చారన్నారు. దానిని పై ఐదుగురికి ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల పక్కన హిందూ శ్మశాన వాటిక వద్ద అప్పగించి వెళ్లిపోయారని తెలిపారు. గంజాయిని ఐదుగురు తీసుకెళ్తుండగా వన్‌టౌన్ సీఐ చరణ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ షేక్ సమందర్ వలి, ఎస్ఐ వంశీకృష్ణ పట్టుకున్నారని చెప్పారు. నిందితుల నుంచి రూ.13.35 లక్షల విలువైన గంజాయితోపాటు ఐదు దొంగలించబడ్డ వాహనాలు, అక్రమ రవాణాకు వినియోగించిన మూడు ద్విచక్రవాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. నిందితులపై నరసరావుపేటతోపాటు గుంటూరు, విజయవాడ, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహన దొంగతనాల కేసులు ఇప్పటికే ఉన్నాయని వెల్లడించారు. పాత నేరస్తులుగా పోలీస్ రికార్డుల్లో ఉన్నారన్నారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

వారి ప్రాణ త్యాగం.. నేటి శాంతి ఫలం

- నేటి నుంచి అమర వీరుల వారోత్సవాలు
- పది రోజులపాటు కార్యక్రమాల నిర్వహణ
- విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ సూచన

పోలీసు అమరుల సేవలు చిరస్మరణీయం

నరసరావుపేట: జిల్లాలో ఈ నెల 21 నుంచి పోలీసు అమర వీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పల్నాడు జిల్లా పోలీసు శాఖ సిద్ధమైంది. అమరుల సేవలను స్మరించుకుంటూ ఈ వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల్ని గుర్తు చేసుకోవడంతోపాటు సమాజంలో కీలకమైన పోలీసుల పాత్ర, విధులు, త్యాగాల గురించి అవగాహన పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు.

నేపథ్యమిదీ...

1959 అక్టోబర్ 21వ తేదీన దేశ భద్రత కోసం పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు భారత్, చైనా సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో భారీగా చైనా సైనికులు భారత్ సరిహద్దుల్లోకి చొరబడి ఒక్కసారిగా సీఆర్‌పీఎఫ్ జవాన్లపై విరుచుకుపడ్డారు. సంఖ్యా బలం తక్కువగా ఉన్నప్పటికీ భారత్ జవాన్లు ఆత్మస్థైర్యంతో చైనా వారిని ఎదురిస్తూ, చివరి రక్తం బొట్టు వరకు పోరాడుతూ దేశం కోసం అసువులు బాశారు. ఈ ఘటనను పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమర వీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు

ఈ నెల 21న సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు స్టేడియంలో అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు ఘటిస్తారు. స్థానిక పోలీసు అమర వీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా మావోయిస్టులు, ఉగ్రవాదులు, ఇతర అసాంఘిక శక్తులు, విధి నిర్వహణలో భాగంగా అల్లర్లు, అలజడుల్లో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ స్మృతి పరేడ్ నిర్వహిస్తారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాలను సందర్శించి వారి సేవలను ప్రజలకు వివరిస్తారు. ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు ప్రేరణ చిత్రాలు ప్రదర్శిస్తారు. 24 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాల, కళాశాలల విద్యార్థులకు సైబర్ క్రైం నియంత్రణలో యువత పాత్ర అంశంపై, పోలీసు సిబ్బంది, పిల్లలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణలో పోలీసుల పాత్ర అనే అంశంపై చర్చావేదికలు, వక్తృత్వ పోటీలు ఉంటాయి. 25 నుంచి 29 వరకు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌తోపాటు సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్‌ల స్థాయిలో ఓపెన్ హౌస్, రక్త దానాలు, వైద్య శిబిరాలు వంటి సామాజిక సేవలను నిర్వహించనున్నారు.



జిల్లా పోలీసు కార్యాలయం



కానిస్టేబుళ్లు సాంబశివారెడ్డి, కోటేశ్వరరావుల విగ్రహాలు

జిల్లాలో అమరులు వీరు...

జిల్లా వ్యాప్తంగా పలువురు పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. దాచేపల్లి ఏరియాలో నరసరావుపేట కేసానుపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుళ్లు జి.సాంబశివారెడ్డి, వై.కోటేశ్వరరావులు మావోయిస్టుల క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. అలాగే చిలకలూరిపేట పోలీసుస్టేషన్‌పై మావోయిస్టులు చేసిన దాడిలో సీఐ ఆర్.ప్రసాదు, హెడ్ కానిస్టేబుల్ ఇ.ఎస్.ఆర్ మోహనరావు, ఎస్.ఉమర్, హోంగార్డు ఆర్.వెంకటేశ్వర్లుతోపాటు జిల్లాలో పలు సంఘటనల్లో తోట వెంటేశ్వర్లు, జీబీ మస్తాన్‌వలి, వి.బ్రహ్మయ్య, కె.శివాంజనేయులు, దాసరి వెంకటేశ్వర్లు, వైపీ రవి కుమార్, సయ్యద్ సాదిక్‌లు ప్రాణ త్యాగం చేశారు.

అందరి బాధ్యత



జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలి. విధి నిర్వహణలో పోలీసులు చేసిన ప్రాణ త్యాగాలు మరువలేనివి. వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

– జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

బంగారం దోపిడీ కేసులో ముగ్గురు మహిళలు అరెస్ట్

నరసరావుపేట టౌన్: మహిళ వద్ద బంగారు ఆభరణాలు దోచుకున్న కేసులో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఎగర్లపల్లికి చెందిన పారిపిరెడ్డి చాందిని ఉరఫ్ యర్రసాని సత్యమ్మ, రవాడ సత్యవతి, పట్టణాల ముత్యాలమ్మలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... ఈ నెల 8వ తేదీన గుంటూరుకు చెందిన పానుగోటి సంజన శ్రీలక్ష్మి నరసరావుపేటలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి శ్రీరాంపురంలోని బంగారం దుకాణానికి వెళ్లారు అక్కడ కొన్ని నగలు మార్చుకొని వాటిని పర్సులో పెట్టుకున్నారు. గమనించిన ముగ్గురు ఆమెను వెంబడించారు. మోటారు సైకిల్‌పై సంజన శ్రీలక్ష్మి వెళ్తుండగా దారిలో సత్యవతి, ముత్యాలమ్మలు వాహనానికి అడ్డు వెళ్లగా, చాందిని పర్సు అపహరించింది. నగల బ్యాగ్‌తో ఆ ముగ్గురు అక్కడ నుంచి పరారీ అయ్యారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న వన్‌టౌన్ సీఐ చరణ్ దుకాణం సమీపంలో సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. దీంతో ముగ్గురు మహిళలను అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీకి గురైన సుమారు 74 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

కృష్ణా నదికి వరద నీరు

కొల్లూరు : ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా నదిలోకి కొద్ది మొత్తంలో నీటిని వదులుతున్న అధికారులు ప్రవాహం అధికమవడంతో ఆదివారం విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 1.18 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని కృష్ణా నదిలోకి ఆ నీరు చేరి నది నిండుగా మారింది. నీటి విడుదల పరిమాణం పెరిగిన పక్షంలో పెసర్లంక అరవింద వారధి ఎగువన నక్కపాయ గండి ద్వారా వరద నీరు కొల్లూరు కరకట్ట దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలలోకి ప్రవేశించే ముప్పు ఉంది.



క్లుప్తంగా

మాచవరంలో 75.8 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట: అల్పపీడ ప్రభావంతో జిల్లాలో వర్షం కొనసాగుతోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాలకు గాను 26 మండలాల్లో వర్షం కురిసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. అత్యధికంగా మాచవరంలో 75.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా మొత్తం 290.2 మి.మీ. వర్షం పడగా మాచర్లలో 29.4, వెల్దుర్తిలో 14.2, దుర్గిలో 5.4, గురజాలలో 1.2, దాచేపల్లిలో 5.2, కారెంపూడిలో 6.2, పిడుగురాళ్లలో 11.2, బెల్లంకొండలో 12.8, అచ్చంపేటలో 40.6, క్రోసూరులో 6.8, అమరావతిలో 5.8, పెదకూరపాడులో 5.0, సత్తెనపల్లిలో 10.8, రాజుపాలెం 2.0, నకరికల్లు 2.8, బొల్లాపల్లిలో 1.4, వినుకొండ 7.2 నూజెండ్ల 12.2, శావల్యాపురం 11.4, ఈపూరు 3.4, రొంపిచర్ల 5.0, నరసరావుపేట 2.4, ముప్పాళ్ల 2.6, చిలకలూరిపేటలో2.4, యడ్లపాడు 7.0 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. కాగా, జిల్లా కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు 'ఎస్‌బీఆర్' విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు బరంపేటలోని ఎస్‌బీఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థి డి.కార్తీక్ ఎంపికైనట్టు స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాడ్మింటన్ పోటీ లలో కార్తీక్ ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థా యి పోటీలకు ఎంపికై నట్టు వివరించారు. ఈనెల 28 నుంచి 30వతేదీ వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మలికిపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో కార్తీక్ ఉమ్మడి గుంటూరుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తాడని వివరించారు. కార్తీక్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు.

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణుడైన అమర్‌చంద్ర

తెనాలి: జాతీయస్థాయిలో యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నిర్వహించిన 'నెట్' (నేషనల్ ఎలిజిబుల్ టెస్ట్)లో తెనాలికి చెందిన ఆళ్లమూడి అమర్ చంద్ర అర్హత సాధించారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న యూజీసీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది జూన్‌లో నెట్ పరీక్షను నిర్వహించింది. రెండు రోజుల కిందట ఫలితాలను ప్రకటించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హులు. జాతీయస్థాయి యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసేందుకు అర్హత లభిస్తుంది. ఈ పరీక్షల్లో 89.18 పర్సంటైల్‌తో ఉత్తీర్ణుడైన అమర్‌చంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, పీహెచ్‌డీకి అర్హత సాధించారు. అమర్‌చంద్ర 2013లో ప్రైవేట్ స్కూలులో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి బీటెక్ పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలో ఎంఏ సోషియాలజీ చేశారు. తెనాలికి చెందిన అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) వ్యవస్థాపకుడు ప్రభాకరరావు కుమారుడు అమర్‌చంద్రను పలువురు అభినందించారు.



ఘటనా స్థలంలో శివ మృతదేహం



ఘటనా స్థలంలో క్షతగ్రాతుడు



క్షతగాత్రుని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

రెప్పపాటులో రోడ్డు ప్రమాదం

- మూడు వాహనాలు ఢీ..
- ఒకరి మృతి
- మరో 11 మందికి గాయాలు

బొల్లాపల్లి: రెప్పపాటులో మూడు వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడిన ఘటన బొల్లాపల్లి మండల పరిధిలోని మట్టి కట్ట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కారెంపూడికి చెందిన నలుగురు యువకులు కారులో బొల్లాపల్లి మండలం మేళ్లవాగు వైపు నుంచి కారెంపూడి వస్తున్నారు. ప్యాసింజర్ ఆటో కారెంపూడి నుంచి మేళ్లవాగు వస్తుండగా కారు– ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనతో వెనుక వేగంగా వస్తున్న గూడ్స్ వాహనం క్షణాల్లో అదుపుతప్పి వీటిని ఢీకొట్టడంతో ప్రమాద ఘటన స్థలం బీభత్సంగా మారింది.



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

ప్రమాదంలో కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీకి చెందిన కారు డ్రైవర్ పేరుబోయిన శివ(23) ఉరఫ్ డీజే అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న నాగేంద్రబాబు తీవ్రంగా గాయపడ్డగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే బొల్లాపల్లి మండలం మేళ్లవాగుకు చెందిన ఆటో డ్రైవర్ పులగం వెంకట్రామయ్యతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న దారం పద్మ, కాటనబోయిన నారాయణ, మరో ముగ్గురు గాయపడ్డారు. ఫ్లిప్ కార్ట్ గూడ్స్ వాహనం డ్రైవర్‌తో పాటు ఉన్న మరొకరికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులలో తీవ్ర గాయాలైన వారిని 108లో నరసరావుపేట, గుంటూరు హాస్పిటల్స్‌కు తరలించారు. బొల్లాపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రుల వివరాలు సేకరిస్తున్నారు. బండ్లమోటు ఎస్‌ఐ ఏ బాలకృష్ణ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే పెళ్లైన ఏడాదికే శివను మృత్యువు కబలించింది. భార్య కుమారుడున్నారు. ఈ ఘటనతో ఆదినారాయణ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పులిచింతల ప్రాజెక్టుకు నీరు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ద్వారా 2,36,813 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జయపాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 11 క్రస్ట్‌గేట్లు మూడు మీటర్లు, మూడు క్రస్ట్‌గేట్లు నాలుగు మీటర్లు ఎత్తి 2,36,813 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న కృష్ణానదికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 75.36 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. ప్రాజెక్టులో నున్న రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.984 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 60.74 మీటర్లకు చేరుకుందన్నారు. నాగార్జునసాగర్ నుంచి 2,31,778 వరద నీరు ఇక్కడ రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.



పులిచింతల ప్రాజెక్టు వైపు పరుగులు పెడుతున్న వరదనీరు

ఆర్థిక సాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

అంబేడ్కర్ విగ్రహం వద్ద వరద బాధితుల నిరసన

నెహ్రూనగర్: వరద బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె. జయసుధ విమర్శించారు. ఆదివారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వరద బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 31న కురిసిన భారీ వర్షానికి నగరంలోని బొంగరాలబీడు, శాంతినగర్, నల్లచెరువు, వసంతరాయపురం, కాకుమానువారితోట, వెంకటప్పయ్యకాలనీ, ఆనందపేట, శారదా కాలనీతో పాటు పలు లోతట్టు కాలనీలు నీట మునిగాయని తెలిపారు. ఇళ్లల్లోని వస్తువులన్నీ పూర్తిగా పాడైపోయాయని చెప్పారు. ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం కొంత మందికి ఇచ్చి..మరి కొంత మందికి ఇవ్వకుండా వదిలేసిందని విమర్శించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి బాధితుల వివరాలు సేకరించకుండా రోడ్డు మీద ఒకరు, ఇద్దరి పేర్లు నమోదు చేసుకుని వెళ్లారని ఆమె ఆరోపించారు. వారికి మాత్రమే రూ.10వేలు చొప్పున జమ చేశారని, మిగిలిన వారి పేర్లు రాసుకోకపోవడంతో వారికి ఆర్థిక సాయం అందలేదని వివరించారు. మిగిలిన బాధితులకు కూడా సాయం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, సీహెచ్ వాసు, రమణయ్య, డెన్నిస్ రాయ్, సాంబశివరావు, మాల్యాద్రి, లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య




ఏఎన్‌యూ: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు క్రీడల ఆవశ్యకతను గుర్తించాలన్నారు. క్రీడారంగానికి యూనివర్సిటీ ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమానికి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పీపీఎస్.పాల్‌కుమార్ అధ్యక్షత వహించారు. పోటీలలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(మొదటి బహుమతి), ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్(రెండో బహుమతి), బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల (మూడో బహుమతి) సాధించాయి. విజేతలకు ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య బహుమతులు అందజేశారు.

ప్రారంభమైన చదరంగం పోటీలు

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం అవసరమని, చెస్ ద్వారా సృజనాత్మకతను మెరుగుదిద్దుకోవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. ఆదివారం లాంలోని కళాశాలలో ఆనంద్ చెస్ వింగ్స్, కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు 232 మంది పాల్గొన్నారన్నారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులకు ఏడు రౌండ్లుగా నిర్వహించడం జరిగిందన్నారు. టోర్నమెంట్‌కు ఆర్బిటర్‌గా ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ మామిడాల గోపీనాథ్ వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని ప్రతి క్రీడాకారుడు తమ క్రీడలో నైపుణ్యతను మెరుగుపరుచుకునే దిశగా కృషి చేయాలన్నారు. గెలుపు సహజమైనా ఓటమి మరో గెలుపునకు నాంది అని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, అధ్యాపకులు, కోఆర్డినేటర్‌లు తదితరులున్నారు.

బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం



తెనాలిరూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడి వద్ద కాల్వలో గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభించింది. గుంటూరు మండలం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో బీటెక్ చదువుతున్న రవీంద్ర(20) ఐదుగురు స్నేహితులతో కలిసి శనివారం ఉదయం సంగంజాగర్లమూడి వచ్చి కొమ్మమూరు కాల్వలో దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. రవీంద్ర మృతదేహాన్ని కాకుమాను మండలం కొల్లిమర్ల వద్ద ఆదివారం గుర్తించారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్, సిబ్బంది అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించాలి



క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఒత్తిడిని అధిగమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు ఆదివారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో బహుమతి ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిందని, తద్వారా అనారోగ్యానికి, ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ పసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో కాకినాడలో 20 వేల మంది ఉపాధ్యాయులతో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలకు గుంటూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నా రు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో సహాయ, సహకారాలు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడా మైదానాలను ఇచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండీ గయాసుద్దొలా, నాయకులు సీహెచ్ ఆదినారాయణ, యు.రాజశేఖర్‌రావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, టి.ఆంజనేయులు, ఏ.శ్రీనివాసరావు, కె. కేదార్‌నాథ్, ఎం.కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్, కె.ప్రభాజీ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో ఐలవరం విద్యార్థుల సత్తా

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ 43వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్స్ అండ్ ఉమెన్స్ షూటింగ్ బాల్ స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్ పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని శ్రీ నేతాజీ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో జరుగుతున్న ఈ పోటీల్లో బాపట్ల జిల్లా నుంచి 28 మంది పాల్గొన్నారు. అందులో ఏడుగురు ఐలవరం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికకావడం గమనార్హం. ఎంపికైన వారిలో పదో తరగతి విద్యార్థులు పి. అనిల్‌కుమార్, కె. రాజశేఖర్, బి. సీతామహాలక్ష్మి, ఎల్. రమ్య, హారిణి, ఎనిమిదో తరగతి విద్యార్థులు జి. సాయి సింధూజ, వి. రాధిక, ప్రియాంక ఉన్నారు. వీరంతా సోమవారం జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనున్నారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని, హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొమెరపూడిని జల్లెడ పట్టిన పోలీసులు



సరైన పత్రాలు లేక పట్టుబడిన ద్విచక్రవాహనాలు



కొమెరపూడిని జల్లెడ పడుతున్న పోలీసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామాన్ని ఆదివారం పోలీసులు జల్లెడ పట్టారు. సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు నేతృత్వంలో సీఐలు ఎంవీ సుబ్బారావు, పోలూరి శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ప్రతి ఇంటిలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, షేక్ అమీనుద్దీన్, 85 మంది పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థులు



ఎ. వరప్రసాద్



జి. సాయి చైతన్య



రిషివర్ధన్



వి. శ్రీదేవి



ఎస్‌కే. శైలు

రొంపిచర్ల: అండర్-14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బీఎం సుభాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల19వ తేదీన నరసరావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కాలేజీలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్-14 బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన బాలుర విభాగంలో ఎ.వరప్రసాద్, జి.సాయి చైతన్య, రిషివర్ధన్, బాలికల విభాగంలో వి.శ్రీదేవి, ఎస్‌కే శైలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల 16 నుంచి చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఎం సుభాని, వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యిట్టి ఏడుకొండలు అభినందించారు.

చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యం

- హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి
- విజ్ఞాన్‌లో ఘనంగా ప్రో-బోనో క్లబ్ ప్రారంభం

చేబ్రోలు: ప్రో-బోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ సేవలను అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించి, ప్రజలకు చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, న్యాయవర్గాలు కలసి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌లో న్యాయబంధు పథకం కింద 'ప్రో-బోనో క్లబ్'ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి మాట్లాడుతూ ఈ క్లబ్ ప్రారంభం ద్వారా న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా పేదలకు చట్టపరమైన సహాయం ఉచితంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. న్యాయవాదులు తమ సామర్థ్యాన్ని, సేవలను స్వచ్ఛందంగా అందించడం ద్వారా సామాజిక న్యాయం అందరికీ సమానంగా చేర్చే ప్రయత్నం చేయాలన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. న్యాయ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా వారి హక్కులు, సమస్యలను పరిష్కరించుకోవడంలో ఇది ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందన్నారు. ప్రో-బోనో క్లబ్ అనేది స్వచ్ఛందంగా సేవలందించే న్యాయవాదులను సమీకరించే వేదికని, ఇక్కడ వారు సివిల్, క్రిమినల్ కేసుల్లో కూడా సహాయం అందిస్తారన్నారు. న్యాయ సేవలు అందరికీ అందడం చాలా అవసరమని, ఈ క్లబ్ ద్వారా న్యాయ సేవలు ప్రజల వరకు చేరతాయన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు నేరుగా న్యాయవాదులను సంప్రదించడం లేదా ప్రభుత్వ న్యాయ వేదికల ద్వారా కూడా కనెక్ట్ అవ్వవచ్చునన్నారు. న్యాయవాదులు కూడా స్వచ్ఛందంగా తమ సమయాన్ని వెచ్చించి, సామాజిక న్యాయంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ కొన్ని దేశాలలో ఇప్పటికే ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ జడ్జీల సహాయంతో వేల కేసులు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులందరూ న్యాయ విద్యతోపాటు ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలలో కూడా పట్టు సాధించాలన్నారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి మెంబర్ సెక్రటరీ ఎం.బబిత, గుంటూరులోని 4వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్ బాబు, హెచ్.అమరలింగేశ్వరరావు, పి.లీలావతి, విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.




ప్రో-బ్రోనో క్లబ్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్

బంగారు పతకం సాధిస్తే రూ. లక్ష ఇస్తా!

క్రీడాకారులకు ఫ్యాంగ్‌టెక్ ల్యాబ్ అధినేత వెంకట్ ఆఫర్

గుంటూరు వెస్ట్(క్రీడలు): జాతీయ క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించే క్రీడాకారులకు రూ.లక్ష బహుమతిగా అందిస్తానని ఫ్యాంగ్ టెక్ ల్యాబ్ అధినేత జిల్లెళ్లమూడి వెంకట్ ఆఫర్ ఇచ్చారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆదివారం స్థానిక లక్ష్మీపురంలోని ఫ్యాంగ్ టెక్ ల్యాబ్ సత్కరించారు. వెంకట్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఎక్కువ శాతం పేదవారు ఉంటారని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. తమ సంస్థ అటువంటి వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఎన్ఆర్ఐ కొల్లా అశోక్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులకు సహాయం అందిస్తామని చెప్పారు. క్రీడా సంఘాలు విరివిగా పోటీలు నిర్వహిస్తే ప్రతిభగల వారు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. అనంతరం జాతీయ పోటీలకు ఎంపికైన ఎస్.రోషన్, ఎస్.హమీద్, ఎండీ ఆసియా, కిశోర్, వై.సతీష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, కోచ్ రవి, సీహెచ్‌వీ రాజు, కె.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



గోలి- జెట్టిపాలెం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోలివాగు

పొంగిపొర్లుతున్న వాగులు

రెంటచింతలలో 40 మి.మీ. వర్షంపాతం

ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలతో పాటు మండలంలో ఆదివారం పడిన వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాలలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గోలి- జెట్టిపాలెం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న గోలివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు కొన్ని గంటల పాటు నిలిచిపోయాయి. కొత్త పాలువాయి-పాత పాలువాయి గ్రామాల మధ్యతో పిల్లివాగు ప్రమాదభరితంగా మారింది. పాలువాయి, తుమ్మకోట గ్రామాల ప్రజలకు ఇతర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. 40 మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ కాంట్రాక్ట్ సూపర్ వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.



పాలువాయి గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న పిల్లివాగు

– రెంటచింతల